రంజాన్ వేళలు
ఇఫ్తార్
బుధవారం
సాయంత్రం - 6:36

ఘనంగా శ్రీ క్రోధి నామ వేడుకలు



షాద్‌నగర్‌లోని వేంకటేశ్వరాలయంలో పంచాంగాన్ని పఠిస్తున్న పూజారి, కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్, తదితరులు

- ఊరూరా ఉగాది సంబరాలు
- షడ్రుచుల పచ్చడి ఆరగింపు
- ఆలయాల్లో పూజలు, పంచాంగ శ్రవణం

తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని మంగళవారం ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఊరువాడా శ్రీ క్రోధి నామ సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, నూతన ఏడాదిలో జీవనం ఒడిదుడుకులు లేకుండా సాగాలని కాంక్షిస్తూ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. గుమ్మాలను మామిడి, వేప తోరణాలతో అలంకరించారు. షడ్రుచుల పచ్చడి సేవించారు. అలాగే భక్షాలు, ఇతర తీపి వంటకాలు ఆరగించారు. సాయంత్రం ఆలయాలు, గ్రామ చావిళ్ల వద్ద పంచాంగ శ్రవణం నిర్వహించారు. రానున్న ఏడాదిలో తమ రాశి ఫలాలు, ఆదాయ వ్యయాలు, వానలు ఎలా ఉన్నాయి? ఏ పంటలు పండుతాయి? వంటివి తెలుసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. కొందరు రైతులు దుక్కి దున్నుకాలతో సాగు పనులకు శ్రీకారం చుట్టారు. - నెట్‌వర్క్



ఇబ్రహీంపట్నం: పోల్కంపల్లిలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

అభివృద్ధి పనులకు నిధులిచ్చి ఆదుకుంటా



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఆదిభట్ల, ఏప్రిల్ 9 : ఆదిభట్ల మున్సిపాలిటీ అభివృద్ధికి అధికంగా నిధులు ఇచ్చి ఆదుకుంటామని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకందేలా చూడాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉగాది సందర్భంగా మంత్రిని ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నగరానికి చేరువలో ఉన్న మున్సిపాలిటీని అభివృద్ధి చేసేందుకు చొరవ తీసుకోవాలని, తాను అండగా ఉంటానని మంత్రి హామీ ఇచ్చినట్లు నిరంజన్‌రెడ్డి తెలిపారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలను ప్రతీ పేద కుటుంబానికి చేరేలా కృషిచేయాలని సూచించారని తెలిపారు. భువనగిరి నుంచి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిని గెలిపించేందుకు పాటుపడాలని మంత్రి సూచించినట్లు నిరంజన్‌రెడ్డి తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కౌన్సిలర్లు, స్థానిక నాయకులు ఉన్నారు.

చెరువు నీటిని తోడేస్తున్న రైతు

- పట్టించుకోని అధికారులు
- పశువులకు నీరు లభించడం లేదని గ్రామస్తుల ఆవేదన



గాలిగూడ కర్ణం చెరువులో పెట్టిన మోటర్‌తో తగ్గుతున్న నీరు

చౌదరిగూడ, ఏప్రిల్ 9 : అసలే ఎండకాలం. చెరువుల్లో పశువులు తాగేందుకు ఉన్న కొద్దిపాటి నీటిని కూడా కొందరు మోటార్లు పెట్టి ఖాళీ చేస్తున్నారని రెవెన్యూ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం గాలిగూడకు చెందిన జంబుల యాదయ్య అనే వ్యక్తి గ్రామ శివారులోని కర్ణం చెరువులో బోరు మోటారు పెట్టి తన పొలానికి నీటిని పంప్ చేస్తున్నాడని గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అయినా మండల అధికారి పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. అసలే పశువులకు నీరు దొరకక ఇబ్బందులు పడుతున్నామని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేశారు. చెరువును ఖాళీ చేస్తున్న రైతుపై చర్యలు తీసుకొని వెంటనే నీటి తరలింపును నిలిపివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మండుతున్న ఎండలు

- మొగిలిగిద్దలో 39.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఎండలు మండుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉదయం 8గంటల నుంచి ఎండ తీవ్రత పెరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో మధ్యాహ్న ఎండ పరిస్థితి భయంకరంగా ఉంటోంది. జనం ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. మంగళవారం రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం మొగిలిగిద్దలో 39.9డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వికారాబాద్ జిల్లా మర్పల్లిలో 39.6డిగ్రీలు, మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ పరిధిలోని ఆదర్శనగర్‌లో 38.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

కాంగ్రెస్ దూకుడు

స్పీడ్ పెంచిన సీఎం రేవంత్



- చేవెళ్ల, మల్కాజ్‌గిరిలపై ఫోకస్
- సీఎంకు సవాల్‌గా మారిన రెండు ఎంపీ స్థానాలు
- తుక్కుగూడ 'జనజాతర'తో కేడర్‌లో జోష్

లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రత్యర్థి పార్టీలకు అవకాశం ఇవ్వకూడదన్న ఉద్దేశ్యంతో దూకుడు పెంచింది. ఈ నెల 6న మహేశ్వరం మండలం తుక్కుగూడలో నిర్వహించిన జనజాతర సభ సక్సెస్‌తో పార్టీ శ్రేణుల్లో జోష్ నింపి ఎన్నికల కదనరంగంలో దూసుకుపోవాలనే సందేశాన్నిచ్చింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని చేవెళ్ల, మల్కాజ్‌గిరి లోక్‌సభా స్థానాల్లో విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని నేతలు పిలుపునిచ్చారు. ఇతర పార్టీల్లోని బలమైన నేతలను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారు. ఎన్నికల నాటికి పార్టీని మరింత పటిష్టం చేసి అభ్యర్థులను గెలిపించాలనే కృత నిశ్చయంతో సీఎం రేవంత్ పావులు కదుపుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

పార్లమెంట్ ఎన్నికలకు గడువు సమీపిస్తుండడంతో అధికార కాంగ్రెస్ ప్రచారంలో దూకుడు పెంచింది. తుక్కుగూడలో ఇటీవల నిర్వహించిన 'జనజాతర' సభ విజయవంతంతో కాంగ్రెస్ కేడర్‌లో జోష్ మరింత పెరిగింది. దీంతో కాంగ్రెస్ అధినాయకత్వం ప్రస్తుత సానుకూల పరిస్థితులను అవకాశంగా మలుచుకొని ఉమ్మడి జిల్లాలోని చేవెళ్ల, మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించే దిశగా పని చేస్తోంది. చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాలు రాష్ట్రంలోనే అత్యంత కీలకమైన నియోజకవర్గాలనే విషయం అందరికీ తెలిసిందే. ఇందులో చేవెళ్ల పార్లమెంట్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ఇన్‌చార్జిగా ఉన్నారు. అలాగే మల్కాజిగిరి స్థానం సైతం నిన్నమొన్నటి వరకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించిన ఎంపీ స్థానం. ఇక్కడ గెలుపు అత్యంత కీలకం. దీంతో ఈ రెండు స్థానాల్లో పార్టీని గెలుపు తీరాలకు చేర్చడం సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో తుక్కుగూడలో గత శనివారం నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర సభ విజయవంతమైంది. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, జాతీయ, రాష్ట్ర నేతలు పాల్గొన్న ఈ సభకు లక్షలాదిగా జనం తరలివచ్చారు. సభకు ఉమ్మడి జిల్లాలోని ఈ రెండు పార్లమెంట్ స్థానాలతో పాటు అంతర్భాగంగా ఉన్న భువనగిరి పార్లమెంట్ స్థానం నుంచి సైతం జనం భారీగా తరలివచ్చారు. ఈ సభ విజయవంతం కావడంతో పార్టీ కేడర్‌లో మరింత జోష్ పెరిగింది. నూతనోత్సాహంతో ఉన్న కేడర్‌ను మరింత కార్యోన్ముఖులను చేసి ఎన్నికల వరకు ఇదే జోష్‌ను కొనసాగించేందుకు పార్టీ నాయకత్వం తగిన వ్యూహరచనలు చేస్తోంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబు, ఇతర ముఖ్య నేతలు, డీసీసీ అధ్యక్షులు స్థానిక నాయకులు, కార్యకర్తలతో రోజువారీ సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లోనూ త్రిముఖ పోటీ నెలకొనడంతో కాంగ్రెస్ పైచేయి సాధించేందుకు తీవ్రంగా శ్రమిస్తోంది. క్షేత్రస్థాయిలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ రోజు రోజుకూ బలహీనపడుతుండడంతో కాంగ్రెస్‌కు బీజేపీతోనే గట్టిపోటీ నెలకొనే పరిస్థితులు కన్పిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ క్రమంగా పట్టును కోల్పోతోంది. ముఖ్యనేతలంతా అధికార కాంగ్రెస్‌తో పాటు బీజేపీ వైపు చూస్తున్నారు. కీలక నేతల్లో ఎక్కువ మంది ఇప్పటికే పాలక కాంగ్రెస్‌లో చేరారు. త్వరలో కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరతారనే ప్రచారమూ సాగుతోంది. దీంతో 'గులాబీ' పార్టీలో గుబులు రేగుతోంది. ఎన్నికల అంచున ఇప్పటికిప్పుడు ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని తయారు చేసుకోలేక పార్టీ బలహీనపడుతోంది. ఎన్నికలు మరో నెల రోజులకు పైగా ఉన్న నేపథ్యంలో పోటీ ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీల మధ్యే ఉంటుందనే ప్రచారం సాగుతోంది.

రెండు స్థానాలపై సీఎం ఫోకస్

ఇదిలా ఉంటే నిన్నమొన్నటి వరకు బీఆర్ఎస్‌లో అధికారం చెలాయించిన నేతలు ఇపుడు కాంగ్రెస్‌లో చేరి ఇక్కడా పెత్తనం చేస్తుండడంపై క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ శ్రేణుల నుంచి కొంత వ్యతిరేకత వ్యక్తమవుతోంది. చేరికల సమయంలో కనీసం తమకు సమాచారం కూడా ఇవ్వకుండా కొత్తగా పార్టీలో చేరిన వారితోనే వ్యవహారాలన్నీ నడుపుతున్నారని సీనియర్లు గుర్రుగా ఉన్నారు. కాంగ్రెస్‌లో చాపకింద నీరులా ఉన్న అసమ్మతి చేవెళ్ల పార్లమెంట్ ఆత్మీయ సమావేశంలో ఇటీవల బట్టబయలైంది. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి నేరుగా ఈ విషయాన్ని ప్రస్తావించారు. పార్టీ అధినాయకత్వం అందరికీ డోర్లు తెరుస్తామంటూ పదే పదే ప్రకటిస్తోందని, కాంగ్రెస్‌ను మోసం చేసిన వారిని, దొంగలను లోపలికి తీసుకువస్తే మాలాంటి కార్యకర్తలు చచ్చిపోతారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు స్పీకర్ ప్రసాద్‌కుమార్, చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, పార్టీ ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. ఆ సమయంలో కేఎల్లార్ చేసిన వ్యాఖ్యలు కలకలాన్ని రేకెత్తించాయి. మరో వైపు చేవెళ్ల, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులిద్దరూ బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారే కావడం కొందరు స్థానిక నేతలకు రుచించడం లేదు. దీంతో అసంతృప్త నేతలు ఇప్పటికీ ఎన్నికల ప్రచారాల్లో అంటీ ముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఈ పరిస్థితులను అధిగమించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా రంగంలో దిగారు. ఆరు నూరైనా ఈ రెండు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిందే అనే సందేశాన్ని కేడర్‌కు ఇస్తున్నారు. ఇందుకు అనుగుణంగా రోజూ ఏదో ఒక ఎదుటి పార్టీల నేతలు, నాయకులు, కార్యకర్తలను పార్టీలో చేర్చుకునే పనిని ముమ్మరం చేశారు. పార్టీలోకి ఎవరొచ్చినా ఎంతో కొంత బలమే కదా? అన్నట్లుగా కాంగ్రెస్ నాయకులు చేరికలను ప్రోత్సహిస్తున్నారు. రెండు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో చేరికలను పెంచడంతో పాటు పార్టీ ప్రచార కార్యక్రమాలనూ ముమ్మరం చేస్తున్నారు. నిత్యం ఈ రెండు నియోజకవర్గాల పరిధి నేతలతో మాట్లాడుతున్నారు. అసంతృప్త నేతలతో వ్యూహ రచనపై చర్చిస్తున్నారు. ఏ పార్టీలో నుంచి చేరిన వారినైనా అందరితో కలిసిపోవాలని సూచిస్తున్నారు. ఇటీవల పక్కనే ఉన్న మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం చేవెళ్ల నియోజకవర్గ పరిస్థితిపై కూడా ఆరా తీశారు.



తుక్కుగూడ జనజాతర సభ(ఫైల్)



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ లక్ష్మారెడ్డి

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

- చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి

చేవెళ్ల, ఏప్రిల్ 9 : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు సేవాభావంతో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి అన్నారు. చేవెళ్ల పట్టణంలో శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం సీఐ లక్ష్మారెడ్డి, సేవా సమితి సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ వేసవిలో ప్రజలు, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు శ్రీ సత్యసాయి సేవా సమితి చలివేంద్రాలను ఏర్పాటు చేస్తోందని, ఇది అభినందనీయం అని అన్నారు. వీరిని యువత ఆదర్శంగా తీసుకొని రహదారుల వెంట, కూడలి ప్రదేశాల్లో మరిన్ని చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సీఐ సూచించారు. ఎండకాలంలో ప్రజలు చలివేంద్రాల సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రదీప్‌కుమార్, శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు గోపాలచారి, మోహన్‌రెడ్డి, వెంకట్‌స్వామి, మధుసూదన్, విఠలయ్య, విఠల్‌రెడ్డి, భాస్కర్, వెంకటేశ్, శంకరయ్య, రవీందర్‌రెడ్డి, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

రూ.3.35కోట్లతో కేజీబీవీ భవన నిర్మాణం

- ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న 'కస్తూర్బా' భవనం
- విశాల వసతులతో ఏర్పాటు
- త్వరలోనే వినియోగంలోకి బిల్డింగ్



ప్రారంభానికి సిద్ధమైన కేజీబీవీ నూతన భవనం

కడ్తాల్, ఏప్రిల్ 9 : కడ్తాలలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం భవన నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఏళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతున్న పాఠశాలతో విద్యార్థినులు పడుతున్న ఇబ్బందులు త్వరలో తొలగనున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం నాటికి నూతన భవనాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కడ్తాలలో 2017-18లో కస్తూర్బాగాంధీ విద్యాలయం ఏర్పాటైంది. నూతన మండలంలో సొంతభవనం లేని విద్యాలయాన్ని శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. ఈ పాఠశాలలో 200 మంది బాలికలు చదువుతున్నారు. అసౌకర్యాల మధ్య అద్దె భవనంలో కొనసాగుతున్న కేజీబీవీకి సొంత భవనం నిర్మించాలని స్థానికులు, విద్యార్థినుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

బిల్లుల పెండింగ్‌తో పనుల్లో జాప్యం

కేజీబీవీ భవన నిర్మాణానికి 2019 నవంబరులో ప్రభుత్వం రూ.3.35 కోట్లు మంజూరు చేసింది. భవన నిర్మాణానికి కానుగు బావి తండా రోడ్డులో రెండెకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. 2020 మార్చి 12న భవన నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన మూడు నెలల తర్వాత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. బేస్మెంట్ లెవల్ వరకు పనులు చేసి పిల్లర్లకు కోసం స్టీలు ఫ్రేములు కట్టి వదిలేశారు. అప్పటి వరకు చేసిన పనులకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. ఇదిలా ఉంటే ప్రజాప్రతినిధుల, స్థానికుల ఒత్తిడితో కొన్ని నెలలుగా నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించారు.

వచ్చే విద్యాసంవత్సరానికల్లా ప్రారంభించేలా త్వరితగతిన పనులు

కేజీబీవీ భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. 2024-25 విద్యా సంవత్సరం ఆరంభం నాటికి నూతన భవనంలో తరగతులు ప్రారంభించేందుకు మండల ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే 90శాతం పనులు పూర్తిచేశారు. కొత్త భవనంలో బాలికలకు కావాల్సిన వసతులన్నీ కల్పిస్తున్నారు. ఫర్నిచర్ కూడ పాఠశాలకు తరలించారు. మిగిలి ఉన్న పనులన్నీ త్వరగా పూర్తిచేసి స్కూళ్లు తెరిచేనాటికి భవనాన్ని సిద్ధం చేయాలని బాలికల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సిబ్బంది ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



కేజీబీవీ పాఠశాల సముదాయం



ఆమనగల్లులో ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, మల్లు రవి, చిత్తరంజన్‌దాస్ తదితరులు

మత సామరస్యానికి ప్రతీక 'ఇఫ్తార్'

ఆమనగల్లు, ఏప్రిల్ 9: ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎంపీ మల్లు రవి, మాజీ మంత్రి జక్కుల చిత్తరంజన్‌దాస్‌లు అన్నారు. ముస్లింల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఆమనగల్లులోని అహ్మదే హిమాల్, మహ్మదీయ మజీద్‌లలో మంగళవారం రాత్రి మాజీ సర్పంచ్ గుర్రం కరుణశ్రీకేశవులు ఆధ్వర్యంలో ఇఫ్తార్ నిర్వహించారు. కార్యక్రమానికి నేతలు అతిథులుగా హాజరయ్యారు. ముస్లింలకు పండ్లు అందజేసి ఉపవాస దీక్షలను విరమింపజేశారు. రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ అల్లా బోధనలు అనుసరణీయం అన్నారు. కులం, కార్యక్రమంలో ఆమనగలుల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ వస్పుల జంగయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మానయ్య, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, మజీద్‌ల అధ్యక్షులు గౌస్ మొయినుద్దీన్, ఖాదర్‌ఖాద్రీ, పీసీసీ కార్యదర్శి మధుసూధన్‌రెడ్డి, నాయకులు గాజుల శ్రీనువాస్, మల్లయ్య, యాదయ్య, రాములు, శివాజీ, ఖలీల్, విజయ్, మైసయ్య, అలీం, ఫరీద్, రామలింగం, సురేశ్, బాబ, ఖాదర్, రఫీ, అజ్జు, అఫీజ్ పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశ ప్రగతి



గచ్చిబౌలి : తుల్జాభవాని ఆలయంలో పూజలు చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

షాబాద్/గచ్చిబౌలి, ఏప్రిల్ 9 : బీజేపీతోనే దేశ ప్రగతి సాధ్యమవుతుందని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొమరబండ, కేసారం గ్రామాలకు చెందిన చల్లా ఇంద్రారెడ్డి, అంజిరెడ్డి, గంధం రమేష్, ఉమ్మెంతాల రమేష్ ఆధ్వర్యంలో 100 మంది యువకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు బడుగు, బలహీన వర్గాల ప్రజలకు చేరుతున్నాయని అన్నారు. మోదీ హయాంలో ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తోందని, భారత్ అతిపెద్ద ఆర్థిక దేశంగా ఎదుగుతోందన్నారు. చేవెళ్ల నుంచి చాలామంది యువత బీజేపీలో చేరుతున్నారని అన్నారు. పార్టీలో చేరిన యువకులు విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపునకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ చేవెళ్ల నియోజకవర్గ కన్వీనర్ రత్నం, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కిరణ్, భూత్ అధ్యక్షులు భవదేశ్, సీనియర్ నాయకులు నారాయణ, రాజు, రాజీవ్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగరేస్తాం

చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగరేస్తామని ఆ పార్టీ అభ్యర్థి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉగాది పర్వదినం పురస్కరించుకుని శేరిలింగంపల్లి తారానగర్ మార్కెట్‌లోని తుల్జాభవాని ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేసి ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.



షాబాద్ : విశ్వేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరుతున్న కొమరబండ, కేసారం గ్రామాల యువకులు

ఈ సందర్భంగా కొండా మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో తన విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లిలో బీజేపీ బలంగా ఉందని, గత ఎన్నికల కంటే అత్యధిక మెజార్టీతో విజయకేతనం ఎగురవేస్తామన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కాంగ్రెస్ మేనిఫెస్టోతో భరోసా

▸▸ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, ఏప్రిల్ 9: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ రూపొందించిన ఎన్నికల మేనిఫెస్టో దేశ ప్రజల్లో భరోసా నింపిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. దేశంలో కాంగ్రెస్ ప్రభంజనం మొదలైందని, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఘోరా పరాభవం తప్పదని అన్నారు. కడ్తాల మండలంలో మంగళవారం నారాయణరెడ్డి పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మక్తమాదారం వేణుగోపాల స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్‌లతో కలిసి నారాయణరెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ పోటీయే కాదన్నారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయామన్న అక్కసుతో మాజీ సీఎం కేసీఆర్, ఆ పార్టీ నాయకులు కుట్ర రాజకీయాలు సాగిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో లబ్ధికోసం వర్షాభావ పరిస్థితులను రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ మతంపేరుతో రాజకీయ లబ్ధికి యత్నిస్తుందని ఆరోపించారు. బీజేపీ మరోమారు అధికారంలోకి వస్తే రాజ్యాంగానికి ప్రమాదమని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే కుల, ఆర్థిక గణన చేపట్టి అన్ని సామాజిక వర్గాలకు మేలు చేస్తుందని చెప్పారు. రాహుల్ నేతృత్వంలో కాంగ్రెస్ కేంద్రంలో అధికారం చేపడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, నాయకులు విఠలయ్యగౌడ్, శంకర్, నర్సింహ, బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ



లింగన్‌పల్లిలో డ్రైనేజీ దుస్థితి

దోమ, ఏప్రిల్ 7: లింగన్‌పల్లిలో మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో మురుగు కాలువలు నిండి రోడ్డుపై పారుతున్నాయని పంచాయతీ కార్యదర్శి సోమలింగంకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో మురుగు కాలువలను శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా గ్రామంలో మిషన్ భగీరథ తాగునీటిని సరఫరా చేసే ట్యాంకు సమీపంలో పైపులైన్ లీకేజీ కావడంతో నీరు వృథా అవుతోందని తెలిపారు. దీంతో గ్రామ ప్రజలకు సరిపడా నీరు రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో

విజయం సాధిస్తా

▸▸ చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి ▸▸ చిలుకూరు నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభం



మొయినాబాద్ రూరల్ : రంగరాజన్‌తో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్/గచ్చిబౌలి, ఏప్రిల్ 9 : చిలుకూరు బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో చేవెళ్ల ఎంపీగా తన గెలుపు ఖాయమని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీ నియోజకవర్గ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ఆలయం నుంచి ప్రారంభించినట్లు రంజిత్‌రెడ్డి తెలిపారు. ఇతర నాయకుల్లా కాకుండా తాను నియోజకవర్గంలోనే ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత ఐదేళ్లలో చేవెళ్ల ప్రాంత అభివృద్ధికి ఎంతగానో కృషి చేసినట్లు తెలిపారు. చిలుకూరు వేంకటేశ్వరుడి ఆశీస్సులతో చేవెళ్ల ఎంపీగా ప్రజలు తనను మళ్లీ ఆశీర్వాదించాలని కోరారు. ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేసే నాయకులకు ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలని చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్ అన్నారు. కార్యక్రమంలో రంజిత్‌రెడ్డి సతీమణి, టీటీడీ బోర్డు సభ్యురాలు సీతారెడ్డి, కుమార్తె ఆకాంక్షరెడ్డి, అల్లుడు రాజేష్ రెడ్డి, కుమారుడు ఆర్యన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డిని ఆశీర్వదించాలి

చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి కోరారు. మంగళవారం ఉదయం నల్లగండ్లకూరగాయాల మార్కెట్‌లో వ్యాపారులకు ఉగాది పచ్చడి పంపిణీ చేస్తూ రంజిత్‌రెడ్డిని ఆశీర్వదించి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్, హఫీజ్‌పేట కార్పొరేటర్ పూజిత, నాయకులు సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రతీ ఒక్కరు కాంగ్రెస్‌కు ఓటు వేయాలని సీతారెడ్డి కోరారు.



చిలుకూరు బాలాజీ ఆలయంలో పూజలు చేస్తున్న రంజిత్‌రెడ్డి

మహిళ సంక్షేమానికి పెద్దపీట



కందుకూరు, ఏప్రిల్ 9 : రాష్ట్రంలో అధికారం చేపట్టి నాలుగు నెలల్లో మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఆ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు బుక్క ప్రశాంతీ పాండురంగారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో గత ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలలో తమ ప్రభుత్వం నాలుగు నెలల కాలంలో ఐదు గ్యారంటీలను సంపూర్ణంగా అమలు చేసినట్లు తెలిపారు. పార్ల మెంట్ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి విజయానికి ప్రతి మహిళ సహకరించాలని కోరారు.



నియోజకవర్గ నాయకులతో రంజిత్‌రెడ్డి



గచ్చిబౌలి : వ్యాపారులకు ఉగాది పచ్చడి అందజేస్తున్న సీతారెడ్డి, జగదీశ్వర్‌గౌడ్

రంజాన్ సందడి

▸▸ ఉపవాసదీక్షలకు ఇంకా కొన్ని గంటలే

▸▸ మేడ్చల్ మార్కెట్‌లో కొనుగోళ్లతో షాపింగ్ సందడి



సేమియాలు విక్రయిస్తున్న దుకాణం

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 9: జిల్లాలో రంజాన్ పండుగ సందడి మొదలైంది. పండుగకు కొత్త దుస్తులు కొనడతో పాటు ఇంటి అవసరాలకు ఉపయోగపడే కొత్త వస్తువులు, పరికరాలను కొనడానికి ముస్లింలు ఈ మాసంలో అత్యధికంగా ఉత్సాహం కనపరుస్తారు. రంజాన్ పండుగ కోసం అవసరమయ్యే సామాగ్రిని ముస్లింలు స్థానిక ప్రధాన మార్కెట్‌లోని దుకాణాలనుంచి కొనుగోలు చేస్తుండగా మరి కొందరు నగరం వెళ్లి తమకిష్టమైనవి కొనుగోలు చేస్తున్నారు. పండుగకు వారం రోజుల ముందు నుంచి ముస్లింలు పెద్దసంఖ్యలో షాపింగ్ చేస్తారు. దీంతో దుకాణదారులు రాత్రి 11గంటల వరకు తెరిచి ఉంచడంతో మార్కెట్ కిటకిటలాడుతోంది. పట్టణ వాసులే కాకుండా మేడ్చల్ చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన ముస్లింలు స్థానిక మార్కెట్‌లోని దుకాణాల నుంచి కొనుగోలు చేస్తున్నారు. హలీం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. పాయసం తయారు చేసేందుకు సేమియాలను స్థానిక మార్కెట్‌లో అందుబాటులో ఉంచారు.



బిజీబిజీగా టైలర్ షాపు నిర్వాహకులు

అన్నీ ఇక్కడే దొరుకుతున్నాయి



గతంలో పండుగ షాపింగ్ కోసం నగరం వెళ్లి కొనితెచ్చుకునే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం అన్ని వస్తువులు ఇక్కడ మార్కెట్‌లో దొరుకుతున్నాయి. ఉపవాసాలు ఉండి నగరం వెళ్లి రావాలంటే ఇనేక ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుతం మేడ్చల్‌లోనే దొరకడంతో ఇబ్బందులు తొలిగాయి.

- సయ్యద్ షకీల్ పాషా-మేడ్చల్

ఘనంగా

సత్యనారాయణ వ్రతాలు

ఆమనగల్లు, ఏప్రిల్ 9 : పట్టణ సమీపంలోని అంతిరింతిరి కొండపై గల శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణనాయక్‌లక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో భక్తులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, ఎస్ఐ భాల్‌రామ్ నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వస్పుల మానయ్య, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి ఎం.డీ ఫరీద్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అర్చకులు నాగ ఫణిశర్మ, వెంకటేశ్వర శర్మల ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నాయకులు పులికంటి మైసయ్య, లక్ష్మణ్ నాయక్, బాల్‌రాజ్,రాంకిరన్, మీనాక్షి, రాములు, బీక్యానాయక్, శీలం వెంకటయ్య, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.




పూజలో పాల్గొన్న భక్తులు

అధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలి

▸▸ టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి

ఆమనగల్లు/కడ్తాల్, ఏప్రిల్ 9 : కేంద్రంలో అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులంతా ఐక్యంగా ముందుకు సాగాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి డాక్టర్ మల్లు రవి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు విజయసోపానమన్నారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఎం.డీ ఫరీద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ మంత్రి జక్కుల చిత్తరంజన్ దాస్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. మల్లు రవి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పతనం ప్రారంభమైందన్నారు. మతం పేరుతో బీజేపీ దేశంలో విద్వేషాలను రెచ్చగొడుతుందని మండిపడ్డారు. దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకొని ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ మోదీ దుర్మార్గ పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోపై దేశ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి, మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్‌లు మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఉపాధి, ఉద్యోగ కల్పనకు పెద్దపీట వేస్తుందన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలలో ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు ఎప్పుడు ముందుండాలని పిలుపు నిచ్చారు. ఎంపీపీ అనితవిజయ్, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు కేశవులు, జంగయ్య, నర్సింహ్మా,బీచ్యానాయక్, కల్లు రమణారెడ్డి, ఎంగిళి ప్రసాద్, బాబా, అలీం, ఖాదర్, మండ్లీ రాములు, గాజుల శ్రీనువాస్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కడ్తాల మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పాలశీతలీకరణ కేంద్రం వద్ద ఎన్ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు షాబోద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు భాస్కర్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ జెండాను నాయకులు ఆవిష్కరించారు. కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. మండల కేంద్రంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు హీరా సింగ్, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు బాల్‌రాజ్, మాజీ సర్పంచ్ రాము నాయక్, నాయకులు భానుకిరణ్, అస్గర్ అలీ, క్యామ రాజేశ్, ఎర్రోళ్ల శ్రీకాంత్, భరత్ యాదవ్, తులసీ రామ్, తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లులో కేక్‌కట్ చేస్తున్న మల్లు రవి


చేవెళ్ల : హనుమాన్ ఆలయంలో పంచాంగం పఠిస్తున్న పండితుడు


మొయినాబాద్ రూరల్ : పంచాంగం పఠిస్తున్న సీఎస్ రంగరాజన్


షాద్‌నగర్ : వేంకటేశ్వరాలయంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న భక్తులు


కొత్తూర్ : పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షడ్రుచుల 'ఉగాది'

- శ్రీ క్రోధి నామ సంవత్సరానికి స్వాగతం
- ఆలయాల్లో పూజలు.. ఉగాది పచ్చడి పంపిణీ
- గ్రామ కూడళ్లు, ఆలయాల్లో పంచాంగ శ్రవణం


కడ్తాల్: మైసిగండి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న నాయకులు


ఆమనగల్లు : పంచాంగ శ్రవణంలో ప్రజాప్రతినిధులు, స్థానికులు


కొందుర్గు : శ్రీలక్ష్మీనృసింహస్వామిని హనుమాన్ ఆలయం వద్దకు తీసుకెళుతున్న భక్తులు


షాబాద్ : తిర్మలాపూర్‌లో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు


తలకొండపల్లిలో పచ్చడి పంపిణీ చేస్తున్న జై శ్రీరామ్ యూత్ సభ్యులు

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి, ఏప్రిల్ 9 : తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని మంగళవారం ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండల కేంద్రాలతో పాటు అన్ని గ్రామాల్లో ప్రజలు ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. ఊరూ వాడా శ్రీ క్రోధి నామ సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. కుటుంబాలు సుఖ సంతోషాలతో ఉండాలని, అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, జీవితాల్లో ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగాలని ఆకాంక్షిస్తూ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది వేడుకల్లో భాగంగా ఇళ్లను పచ్చటి మామిడి తోరణాలతో అలంకరించి దేవతా మూర్తులకు పూజలు చేపట్టారు. ప్రతీ ఇంట ఉదయమే నూతనంగా కొనుగోలు చేసిన మట్టికుండల్లో షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి తయారు చేసి పిల్లలు, పెద్దలు పంచుకున్నారు. అనాదిగా వస్తున్న ఆచారంలో భాగంగా పూర్ణంతో కూడిన బెల్లం, చక్కెర భక్షాలను చేసి కుటుంబ సభ్యులు ఆరగించారు. సాయంత్రం అన్ని గ్రామాల కూడళ్లు , దేవాలయాలలో అర్చకులు, వేదపండితులు పంచాంగ శ్రవణం కార్యక్రమాన్నినిర్వహించారు. ప్రజలు కూడ తమ జాతకాలను అర్చకులతో చూయించుకున్నారు. ఈ సందర్భంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అండేకార్ యాదిలాల్ లకు ఆయా పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

కొత్తూర్ : ఆధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత నెలకొంటుందని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ అన్నారు. మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వతండాలోని సంత్‌శ్రీసేవాలాల్ మహరాజ్, మరియమ్మయాడి దేవాలయం వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా అంజయ్య యాదవ్ పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తి మార్గంతోనే ముక్తి లభిస్తుందన్నారు. ప్రతీఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలన్నారు. అనంతరం నిర్వాహకులు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు ఎమ్మె సత్యనారాయణ, మిట్టనాయక్, పెంటనోళ్ల యాదగిరి, శ్రీరాములు యాదవ్, అజయ్‌నాయక్, గోపాల్ నాయక్, సభావత్‌శంకర్, బానునాయక్, కొర్ర రవి, ప్రేమ్‌కుమార్, రఘునాయక్, రాజన్‌నాయక్, బద్రి, వర్యా, నరేష్, మణికాంత్, రామచందర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కొత్తూర్ మున్సిపాలిటీతో పాటు, మండలంలోని ఆయా గ్రామాల్లో తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గృహాలను మామిడి తోరణాలు, పూలతో సర్వంగా సుందరంగా తీర్చిదిద్దుకుని, నూతన వస్త్రాలు ధరించి ప్రత్యేక పూజలు చేసుకున్నారు. శడ్రుచులతో కూడిన పచ్చడి సేవించి, ఒకరికి ఒకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దేవాలయాల్లో పండితులు శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణాన్ని చదివి వినిపించారు.


యాచారం : యాచారంలో పొలం పనులు ప్రారంభిస్తున్న రైతు

యాచారం : ఈ ఏడాది చాలా తక్కువగా వర్షాలు కురుస్తాయని, పంటలు చాలా తక్కువగా పండుతాయని వేదపండితులు వెల్లడించారు. ఉగాది సందర్భంగా మంగళవారం సాయంత్రం యాచారం, కుర్మిద్ద, మేడిపల్లి, మాల్ తదితర గ్రామాల్లో వేదపండితులు పంచాంగ శ్రవణం వినిపించారు. కుజుడు రాజుగా, శని మంత్రిగా వ్యవహరించడంతో ఆశించిన రీతిగా వర్షాలు కురియవని చెప్పారు. పంటలు చాలా తక్కువగా పండుతాయని తద్వారా పండిన పంటలకు ధర అధికంగా ఉంటుందని వేదపండితులు వెల్లడించారు. నీటి కష్టాలు అధికంగా ఉంటాయని, తాగునీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. యాచారం మండల పరిధిలోని రైతులు పొలం పనులను మంగళవారం ప్రారంభించారు. పొలంలో ముళ్లకంప చెట్లను నరికివేశారు. పనికి రాని చెట్లను కాల్చి, ఎడ్ల కొమ్ములకు గజ్జెలు కట్టి పొలం దున్నారు.

శంషాబాద్ : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని వివిధ బస్తీల్లో శ్రీ క్రోధి నామసంవత్సర ఉగాదిని ఘనంగా జరుపుకున్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, ధర్మగిరి ధర్మసాయి దేవాలయం, శివ్‌శంకర్‌హనుమాన్ మందిర్, శక్కరి మఠం దేవాలయం, సాతంరాయి రామ్‌మందిర్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొల్లపల్లి రోడ్డులో ఉన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పండితులు గోపాలాచారి, రాఘవేంద్రచారిలు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు.

కందుకూరు : శ్రీక్రోధి నామ సంవత్సరాది ఉగాదిని మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇంటికి మామి తోరణాలు, వాకిల్లలో రంగురంగుల ముగ్గులు వేశారు. మధ్యాహ్నం నేదునూరు, కందుకూరు, కొత్తగూడ, బాచుపల్లి, తిమ్మాపురం, లేమూరు, గూడూరు, కొత్తూరు, పులిమామిడి, దెబ్బడగూడ, మీర్కాన్‌పేట, ఆకులమైలారం, గుమ్మడవెల్లి రాచులూరు తదితర గ్రామాల్లో దేవాలయాల ఎదుట వేద పండితులు రుతువుల, వర్షాలు, పంటలపై గ్రామస్తులకు పంచాంగ శ్రవనాన్ని వినిపించారు. జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, ఎంపీపీ మంద జ్యోతి, ఆయ గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, వివిధ పార్టీలకు చెందిన నేతలు తదితర్రులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : ఉగాదిని ఇబ్రహీంపట్నం ప్రాంత ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. షడ్రుచులతో కూడిన పచ్చడి, భక్షాలు ఈ పండగ ప్రత్యేకత కాగా.. హిందువులు ఇంటింటా వీటిని ఆరగించారు. సాయంత్రం వేళ దేవాలయాల్లో పంచాంగ శ్రవణ పఠనం చదివి వినిపించారు. పోల్కంపల్లి గ్రామంలో సీపీఎం గ్రామ శాఖ, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మండల శాఖల ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఐద్వా మండలాధ్యక్షురాలు పి.మున్నీ, సీపీఎం నాయకులు నర్సింహ, అశోక్ తదితరులున్నారు.

షాద్‌నగర్ అర్బన్ : షాద్‌నగర్ నియోజకవర్గంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయాలకు భక్తుల రద్దీ పెరిగింది. సాయంత్రం ప్రధాన ఆలయాల్లో పండితులు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. షాద్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన పంచాంగ శ్రవణ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, ఐఏఎస్ అధికారి ఇప్పలపల్లి సుస్మిత, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ అగ్గనూరి విశ్వంతో పాటు అధిక సంఖ్యలో భక్తులు హాజరైనారు. ఆలయంలో వేంకటేశ్వరుడి పల్లకీ సేవను నిర్వహించిన అనంతరం ఆలయ పూజారి శ్రీనివాసచార్యులు పంచాంగ శ్రవణాన్ని వినిపించారు. ఈ ఏడాది వర్షాలు అనుకూలంగా ఉంటాయని, ఎర్రని పప్పులు, ధాన్యం భాగా పండుతాయని వివరించారు. రాశులవారీగా జాతక ఫలాలను చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ శ్రీ క్రోధనామ సంవత్సరంలో ప్రతీ ఒక్కరు కోప, తాపాలకు వెళ్లకుండా ప్రశాంతంగా జీవనం సాగించాలని కోరారు. తాను కూడా రాజకీయాలకు అతీతంగా రాగద్వేశాలు లేకుండా సేవ చేస్తానని అన్నారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు మాట్లాడుతూ సమాజంలో పెరిగిపోతున్న వ్యక్తిగత స్వార్థానికి ప్రతి ఒక్కరు దూరమై పరోపకార బుద్ధితో సమాజ సేవ భావంతో ముందుకు సాగాలని కోరారు. స్థానిక దత్తాత్రేయస్వామి దేవాలయంలో హిందూ వాహిని నాయకులు చెట్ల వెంకటేష్, గుడల రమేష్, జీ.విజయ్‌లు ఉగాది పచ్చడి వితరణ చేశారు.

కొందుర్గు : మండలంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రజలు షడ్రుచులతో చేసిన పచ్చడిని సేవించారు. వ్యాపార సంస్థలను, దుకాణాలను మామిడితోరణాలు, పూలతో అందంగా అలంకరించారు. మండల కేంద్రంలో, పెండ్యాల గుట్ట మీద ఉన్న శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయాలను మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. ఉదయం 6గంటలకు మండల కేంద్రంలో ఉన్న దేవాలయంలో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం పెండ్యాల గుట్ట మీద ఉన్న శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవాలయం నుంచి స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని మండల కేంద్రం శివారులో ఉన్న హనుమాన్ దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో వీరన్నపేట్ గ్రామస్తులు ప్రదర్శించిన కోలాటం, చెక్కభజనలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. దేవాలయ పూజారి భరత్ పంచాంగం చదివి వినిపించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, వైస్‌ఎంపీపీ రాజేష్ పటేల్, కావలి యాద య్య, చేవెళ్ల కృష్ణయ్య, బోయ నర్సింలు, బాల్‌రాజ్, మాధవరెడ్డి, వేణుగోపాల్, కె.రాములుగౌడ్, పెద్ది శ్రీనివాస్, ఈసరి సత్యనారాయణ, కె.లక్ష్మయ్య గౌడ్, నరేందర్ గౌడ్, రామకృష్ణగౌడ్, వేణుగోపాల్‌గౌడ్, శంకర్, శ్రీశైలం, బుచ్చయ్యగౌడ్, నర్సింలు, మల్లేష్, యాదయ్య, ఎస్.శ్రీనివాస్ తదితరులున్నారు.

కేశంపేట : మండలంలో ఉగాదిని ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి గ్రామాల ప్రజలు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయాల్లో పూజారులు పంచాంగం చదివి వినిపించారు. ఎక్లాస్‌ఖాన్‌పేట, కొత్తపేట, కొండారెడ్డిపల్లి, కాకునూర్, తొమ్మిదిరేకుల, నిర్ధవెల్లి, లింగంధన, లేమామిడిలోని ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చేవెళ్ల : చేవెళ్ల నియోజకవర్గంలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల్లోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఉగాదిని ఘనంగా జరుపుకున్నారు. తెలుగు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. హనుమన్ దేవాలయల వద్ద వేదపండితులు, అర్చకులు పంచాంగ శ్రావణం చదివి రాశిఫలాలను వినిపించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మొయినాబాద్ రూరల్ : ఉగాది వేడుకలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో వేదపండితులు నూతన సంవత్సర పంచాంగాన్ని గ్రామస్తులకు చదివి వినిపించారు. చిలుకూరు బాలాజీ దేవాలయంలో ఆలయం ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్ పంచాంగ శ్రవణం పఠించారు. ప్రజలు ఈ నూతన సంవత్సరంలో సుఖసంతోషాలతో గడపాలని చిలుకూరు బాలాజీని వేడుకున్నట్లు రంగరాజన్ తెలిపారు.

షాబాద్ : శ్రీ క్రోధినామ సంవత్సరంలో సకాలంలో వర్షాలు కురిసి పాడి, పంటలు సమృద్ధిగా ఉంటాయని పంచాగ శ్రవణ పండితులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలో 41 గ్రామ పంచాయితీల్లో వేదపండితులు ప్రంచాగ శ్రవణం చదివి వినిపించారు. గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపిటీసీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


శంషాబాద్ : పంచాంగం పఠిస్తున్న అర్చకులు


కందుకూరు: కందుకూరులో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు


శంకర్‌పల్లి : సంకేపల్లిలో పంచాంగం పఠిస్తున్న వేదపండితుడు

వీరశైవ లింగాయత్‌ల అభివృద్ధికి కృషి

చేవెళ్ల, ఏప్రిల్ 9 : వీరశైవ లింగాయత్ సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని శ్రీ వీర శైవ లింగాయత్ చేవెళ్ల మండలాధ్యక్షుడు కర్నె శివప్రసాద్ తెలిపారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని హనుమన్ దేవాలయంలో వీరశైవ లింగాయత్ చేవెళ్ల మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చేవెళ్ల మండల అధ్యక్షులుగా కర్నె శివప్రసాద్‌ను ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ వీరశైవలు అన్నిరంగాల్లో రాణించేలంటే వీరశైవ లింగాయత్‌లు ఐక్యంగా ఉండాలన్నారు. వీర శైవలింగాయత్ కమిటీ అభివృద్ధి నిరంతరం పాటుపడుతానన్నారు. వీరశైవలను చైతన్యపరుస్తానని ఆయన అన్నారు. భవిష్యత్తులో వీరశైవుల సత్తా ఏమిటో చూపించాలన్నారు. వీరశైవ హక్కుల కోసం పోరాటానికి సంఘం నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన సంఘం సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్ నాయకులు, మాజీ వైఎస్ ఎంపీపీ జంగం శివనందం, వీరేశం తదితరులు ఉన్నారు.


బసవేశ్వరుడి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నూతన కార్యవర్గం సభ్యులు

చేవెళ్ల మండల నూతన కమిటీ

చేవెళ్ల మండల వీరశైవ లింగాయత్ అధ్యక్షుడిగా కర్నె శివప్రసాద్, ఉపాధ్యక్షుడిగా జె. వీరేశం, ప్రధాన కార్యదర్శిగా జంగం ప్రసాద్, కోశాధికారి కె.వీరేశం, కార్యదర్శి కె.విశ్వనాథం, గౌరవాధ్యక్షులుగా ఎం.ప్రభులింగం, నాగేంద్రబాబు, కార్యవర్గ సభ్యులుగా జె. సంఘమేశ్వర్, కె.రాజు, రామలింగప్ప, భద్రప్ప, టి.వినయ్‌కుమార్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సంక్షిప్తంగా..

కడ్తాల్ : అంబలి కేంద్రాలు, చలివేంద్రాల ఏర్పాటు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ముందుకు రావాలని టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్, ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని సందర్శించారు.

చేవెళ్ల : లోవోల్టేజీతో వాటర్ ప్లాంట్ మీటర్, బోర్ స్టార్టర్ కాలిపోయాయి. శంకర్‌పల్లి మండల పరిధిలోని కొండకల్ గ్రామంలో మంగళవారం వాటర్ ప్లాంట్ మీటర్, బోరు స్టార్టర్ కాలిపోగా.. రేకులు ఇంట్లో పొగలు రావడంతో వెంటనే నీరుపోశారు. కరెంట్ సరఫరాలో హెచ్చుతగ్గులు రావడంతోనే ప్రమాదం జరిగిందని బాధితుడు రాము వాపోయాడు. 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి లోవోల్టేజీ సమస్యను తీర్చాలని కోరాడు.

కేశంపేట : సీతారామాంజనేయ స్వామి ఆలయానికి కేశంపేటకు చెందిన కోడుపర్తి సుశీల అనంతరెడ్డిల జ్ఞాపకార్థం కుమారులు శ్రీకాంత్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి నాలుగు సీలింగ్ ఫ్యాన్లను అందించారు.

తలకొండపల్లి : మాజీ మంత్రి హరీష్ రావును మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ హైదరాబాద్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.

టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఖాజాపాషా

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 9 : టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా షాద్‌నగర్‌కు చెందిన జర్నలిస్టు ఖాజాపాషా ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతిసాగర్‌లు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఖాజాపాషా తెలిపారు. కాగా, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తన క్యాంపు కార్యాలయంలో ఖాజాపాషాను సన్మానించి, అభినందించారు.


ఖాజాపాషాను అభినందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

అంబేడ్కర్ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

యాచారం, ఏప్రిల్ 9 : కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలకతీతంగా నిరుపేదల కడగండ్లు తీరుస్తుందని, ఆరు గ్యారంటీలను అర్హులందరికీ అందేలా కార్యకర్తలు శ్రద్ధ తీసుకోవాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో ఈనెల 14న యాచారం మండలంలోని గున్‌గల్‌లో జరిగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతి ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆ విష్కరించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ప్రతి పేద కుటుంబానికి రూ.5లక్షల నిధులు ఇవ్వడానికి ముఖ్యమంత్రి చొరవ తీసుకుంటున్నారని చెప్పారు. తమ ప్రభుత్వంపై కావాలని కొందరు పనిగట్టుకొని విమర్శలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. గున్‌గల్‌లో జరిగే ఉత్సవాలకు భారీగా కార్యకర్తలను తరలించాలన్నారు. కార్యక్రమంలో ముస్కు నర్సింహ, వరికుప్పల తిరుమలేష్, రామకృష్ణయాదవ్, బాసాని బుచ్చిరెడ్డి, గిరమోని రవీందర్, కృష్ణమూర్తి తదితరులున్నారు. కాగా వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేను తన నివాసంలో కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.


పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఆరోగ్యధామ్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మహేశ్వరం, ఏప్రిల్ 9 : సమాజంలో సత్యం, ధర్మం న్యాయానికి కట్టుబడి ఉండాలని, ప్రజలంతా ప్రతిరోజు ఆరోగ్యంగా ఉంటూ 120 సంవత్సరాలు సంతోషంగా జీవించాలనే ఉద్దేశంతో మండల పరిధిలోని అవేర్‌లో ఆరోగ్యధామ్ పేరుతో ఆసుపత్రిని ఏర్పాటు చేస్తున్నామని ఆ సంస్థ చైర్మన్ మాధవన్ జీ అన్నారు. మంగళవారం అవేర్‌లో ఆరోగ్యధామ్ పేరుతో ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా ఎన్నోరకాలుగా పేదలకు రకరకాల సేవలందిస్తున్న అవేర్ సంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్యకేంద్రాన్ని ప్రారంభించామన్నారు. అంతేకాకుండా అవేర్‌లో త్వరలో మెడికల్ కాలేజీని కూడా ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఆయుర్వేదిక్, యునాని, హోమియో, వెల్‌నెస్, యోగా వంటి వైద్యసేవలను అందిస్తామని తెలిపారు. ఈ సేవలను ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ సీహెచ్. కేతన్, అవేర్ సంస్థ కార్యనిర్వాహక కార్యదర్శి నారపంగ వెంకన్నతో తదితరులు పాల్గొన్నారు.


ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంబిస్తున్న మాధవన్‌జీ

ఆరోగ్యమే మహాభాగ్యం

కందుకూరు, ఏప్రిల్ 9: ఆరోగ్యమే మహాభాగ్యమని, మద్యపానం, ధూమపానం మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని లేమూరు భగవద్గీత ప్రబోధకులు శివ కోరారు. మంగళవారం సాయంత్రం గ్రామస్తులు, భగవద్గీత భక్త బృందం సభ్యులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువత మద్యపానానికి, ధూమపానానికి బానిసలై అనార్యోనికి గురౌతున్నట్లు తెలిపారు. ఇలాంటి అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కబేళాకు తరలిస్తున్న గోవులు స్వాధీనం

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 9 : కబేళాకు తరలిస్తున్న గోవులను స్వాధీనం చేసుకున్న సంఘటన మంగళవారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా గోవులను కబేళాకు తరలిస్తున్న సమాచారం అందుకున్న శంషాబాద్ పోలీసులు మదన్‌పల్లి వద్ద టీఎస్ 12 యూఏ 1992 కంటైనర్‌ను తనిఖీ చేయగా.. 15 ఆవులు, 58 ఎద్దులు తీసుకెళ్తున్నట్లు గమనించారు. డ్రైవర్ దర్శనం కృష్ణమూర్తి, హెల్పర్ ఎండీ అమీర్, గోవులను కొనుగోలు చేసిన అమీరుద్దీన్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. గోవులను గోశాలకు తరలించినట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం


సుశీల

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 9 : భర్తతో గొడవ పడి తల్లి, కూతురు అదృశ్యమైన సంఘటన మంగళవారం శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో జరిగింది. సీఐ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని గొల్లపల్లికి చెందిన సుశీల, ప్రభు భార్యభర్తలు. గత కొన్ని రోజులుగా భార్యాభర్తలు తరచూ గొడవపడుతున్నారు. ఈక్రమంలో ఈ నెల 8వ తేదీన మరోసారి సుశీల, ప్రభు గొడవ పడ్డారు. దాంతో భార్య సుశీల తన కూతరు శ్రీవాణిని తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దాంతో మంగళవారం ప్రభు శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు.. జేసీబీ, రెండు టిప్పర్లు సీజ్

షాద్‌నగర్ రూరల్/మాడ్గుల, ఏప్రిల్ 9 : మట్టి మాఫియా రెచ్చిపోతోంది. రాత్రీ పగలు తేడాలేకుండా యథేచ్ఛగా మట్టి తవ్వకాలు చేపడుతన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల శివారులోని వెంకటాపురం చెరువులో సోమవారం రాత్రి రెండు జేసీబీలు, మూడు టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న వెలిజర్ల గ్రామస్తులు చెరువు వద్దకు చేరుకుని అడ్డుకున్నారు. కాగా, ఆ సమయంలో మట్టి తరలింపునకు వత్తాసు పలుకుతున్న కేశంపేట మండలానికి చెందిన కొందరు నాయకులు వెలిజర్ల గ్రామస్తులపై దాడికి ప్రయత్నించారు. అదే సమయంలో అక్కడికి కేశంపేట పోలీసులు చేరుకున్నారు. అయినా, మట్టి తవ్వకాలు కొనసాగుతుండటంతో వెలిజర్ల గ్రామానికి చెందిన దొడ్డి రవీందర్ డయల్ 100కు ఫోన్ చేశాడు. షాద్‌నగర్ పోలీసులు ఒక జేసీబీ, రెండు టిప్పర్లను సీజ్ చేశారు. అదే రాత్రి దొడ్డి రవీందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా మాడ్గుల మండలం అందుగుల వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు.